సాక్షి పశ్చిమగోదావరి

సోమవారం । 12 । మే । 2025



ఆక్వాపై యుద్ధం ఎఫెక్ట్

భారత్-పాక్ యుద్ధం బూచిగా చూపిస్తూ రొయ్య ధరల్లో కిలోకు రూ.10 వరకు కంపెనీలు కోత విధించాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. 8లో



అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

తణుకులోని ఓ అపార్ట్‌మెంట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. బెడ్‌రూంలో రేగిన మంటలతో దట్టమైన పొగ వ్యాపించింది. 8లో



వలస పక్షుల స్వర్గం కొల్లేరు

వలస పక్షులకు స్వర్గధామం కొల్లేరు. కొల్లేరు అభయారణ్య ప్రాంతానికి ఏటా శీతాకాలంలో లక్షలాది వలస పక్షులు సంతానోత్పత్తి కోసం వస్తాయి. 8లో

న్యూస్‌రీల్

మాజీ మంత్రి రజినీపై పోలీసుల తీరు దారుణం

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకు అర్బన్: మాజీ మంత్రి, బీసీ మహిళ, వైఎస్సార్‌సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి విడుదల రజినీపై చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బరాయుడు ప్రవర్తించిన తీరు దారుణమని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి మంత్రిగా పనిచేసిన రజినీని కనీస గౌరవం ఇవ్వకుండా, మహిళ అని చూడకుండా చేయిపట్టుకుని పక్కకు తోసేయడం దుర్మార్గమన్నారు. రెండు రోజుల క్రితం కంతేరులో ఎస్సీ మహిళా ఎంపీటీసీ సభ్యురాలిని కూడా అర్ధరాత్రి అరెస్టు చేశారని, దుస్తులు మార్చుకోవడానికి రెండు నిమిషాలు సమయం అడిగినా పోలీసులు నిరాకరించి ఆమెను బలవంతంగా పోలీసు జీపు ఎక్కించారన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని దుయ్యబట్టారు. మహిళల విషయంలో ఎలా ప్రవర్తించాలో తెలియని **కూటమి** ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలు **బుద్ధి చెబు**తారని కారుమూరి అన్నారు.

మీడియా వ్యవస్థపై దాడులు మానాలి



ఈద జాషువా

భీమవరం: సాక్షి మీడియాపై కక్ష సాధింపు దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ సీపీ ఇంటలెక్చువల్స్ ఫోరం విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ఈద జాషువా అన్నారు. సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి నివాసంలో నోటీసులు ఇవ్వకుండానే పోలీసులు చేసిన సోదాలు పత్రికా స్వాతంత్ర్యంపై జరిగిన దాడిగా పరిగణించాలన్నారు. మీడియా వ్యవస్థలపై రాజకీయ కక్ష పూరిత దాడులను మానాలని డిమాండ్ చేశారు.

మురళీ నాయక్ త్యాగం మరువలేం

పాకిస్తాన్ కాల్పుల్లో మరణించిన భారత ఆర్మీ జవాన్ మురళీ నాయక్ దేశ భద్రత కోసం వీరమరణం పొందడం విషాదకరమని జాషువా అన్నారు. మురళీనాయక్ ప్రాణాలను ప్రాణంగా పెట్టి దేశ రక్షణ కోసం చేసిన త్యాగం ఎన్నటికీ నిలిచి పోతుందన్నారు. మురళీనాయక్ వీరత్వం దేశ పౌరులకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.

అరటి రైతులకు మాజీ సీఎం జగన్ చేయూత హర్షణీయం

దెందులూరు: కడప జిల్లాలో 2024 మార్చిలో కురిసిన వర్షాలు, వరదలకు నష్టపోయిన 670 మంది అరటి రైతులకు మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రూ.1.14 కోట్ల ఆర్థిక సాయం అందించడం వైఎస్ కుటుంబానికి రైతులపై ఉన్న నిబద్ధతకు నిదర్శనమని ఏలూరు జిల్లా అరటి రైతు సంక్షేమ సంఘం నేత, వైఎస్సార్ సీపీ నేత ఉప్పలపాటి సత్తిబాబు అన్నారు. ఆదివారం సంక్షేమ సంఘ నాయకులు విలేకరులతో మాట్లాడారు. అరటి రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోకపోవడంతో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హెక్టారుకు రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లా అరటి రైతు సంక్షేమ సంఘం తరఫున ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు సంఘ నేత సత్తిబాబు తెలిపారు.

14న ఏపీటీఎఫ్ ధర్నా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 14న విజయవాడలో నిర్వహించనున్న భారీ ధర్నాకు టీచర్లు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డి దొర ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అమలు చేయనున్న 9 రకాల పాఠశాలల వ్యవస్థ అసంబద్ధంగా ఉందని, ప్రాథమిక పాఠశాల వ్యవస్థ నిర్వీర్యం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని మూడు రకాల పాఠశాల వ్యవస్థను అమలు చేయాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించి, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను మంజూరు చేయాలని, సంపాదిత సెలవుల నగదును ఖాతాల్లో జమ చేయాలని, 11వ పీఆర్సీ ఆర్థిక బకాయిలతో పాటు అన్నిరకాల ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆప్కాబ్ చైర్మన్‌గా గన్ని

భీమడోలు: ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు రాష్ట్ర కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ (ఆప్కాబ్) చైర్మన్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా నియమితులయ్యారు. జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆయనకు అభినందనలు తెలిపారు. భీమడోలులోని పార్టీ కార్యాలయంలో టీడీపీ శ్రేణుల సంబరాలు అంబరాన్నంటాయి.


కమనీయం.. శ్రీవారి కల్యాణం

నేత్రపర్వంగా చిన వెంకన్న కల్యాణోత్సవం



మోహినీ అవతారంలో శ్రీవారు

ద్వారకాతిరుమల: సర్వాభరణ భూషితుడైన శ్రీవారు నుదుటున కల్యాణ తిలకం, బుగ్గన చుక్కలతో సిగ్గులొలుకుతున్న అమ్మవార్లను పెండ్లాడారు. ద్వారకాతిరుమల చినవెంకన్న బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన తిరుకల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ తూర్పు రాజగోపురం వద్ద కల్యాణ వేదికపైకి శ్రీవారు, అమ్మవార్లను వేర్వేరు వాహనాల్లో తీసుకువచ్చి రజిత సింహాసనంపై వేంచేపు చేశారు. అనంతరం అర్చకులు కల్యాణ తంతును ప్రారంభించి, పలు ఘట్టాలను పూర్తిచేసి శుభముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేసి, మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకలను జరిపించారు. దేవస్థానం తరఫున శ్రీవారికి ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు కుమారుడు



వేదికపై కల్యాణ తంతు జరిపిస్తున్న అర్చకులు

నివృతరావు పట్టువస్త్రాలను సమర్పించగా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవార్లకు ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణమూర్తి, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పట్టువస్త్రాలను అందించారు. పాంచాహ్నిక దీక్షతో వైఖానస ఆగమాన్ని అనుసరించి జరిపిన వేడుక భక్తజనులను పరవశింపజేసింది. కల్యాణోత్సవం అనంతరం స్వామి, అమ్మవార్లు వెండి గరుడ వాహనంపై క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగారు. ఆలయ ముఖ మండపంలో ప్రత్యేక అలంకరణలో భాగంగా స్వామివారు మోహినీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు రథోత్సవం

ఆదివారం రాత్రి 8 గంటల నుంచి శ్రీవారి దివ్య రథోత్సవం నిర్వహించనున్నారు. శ్రీవారి ప్రత్యేక అలంకారం రాజమన్నార్.

దుర్గగుడి నుంచి పట్టువస్త్రాలు

చినవెంకన్న బ్రహ్మోత్సవాలకు విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం వారు పట్టువస్త్రాలు సమర్పించారు. దుర్గగుడి ఈఓ వీకే శీనానాయక్ దంపతులు పట్టువస్త్రాలను ఇక్కడి ఈఓ సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా అర్చకులకు అందజేశారు.



స్వామి, అమ్మవార్లను కల్యాణ వేదిక వద్దకు తీసుకువస్తున్న దృశ్యం




శ్రీవారికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న ఆలయ అనువంశిక ధర్మకర్త నివృతరావు

గూడుకట్టుకున్న నిర్లక్ష్యం

పడకేసిన ఇళ్ల నిర్మాణం

- పెరిగిన వ్యయం.. చాలని సాయం
- ముందుకు సాగని పనులు
- మే నెలాఖరుకు 9,107 ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యం
- ఏడాదిలో పూర్తయినవి కేవలం 3,434 గృహాలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో భారీగా పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ
- జిల్లాలో 626 లేఅవుట్లలో 47,362 మందికి స్థలాల అందజేత



గూడు గోడు : భీమవరం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం

సాక్షి, భీమవరం : పేదల సొంతింటి కలను సాకారం చేసే పక్కా ఇళ్ల నిర్మాణం జిల్లాలో నత్తనడకన సాగుతోంది. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో 9,107 ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలన్నది లక్ష్యం కాగా ఇప్పటివరకు 3,434 మాత్రమే పూర్తయ్యాయి. నిర్మాణ వ్యయం పెరిగిపోవడం, ప్రభుత్వ సాయం చాలక ఇళ్ల నిర్మాణానికి పేదవర్గాల వారు ముందుకు రాని పరిస్థితి నెలకొంది.

లక్ష్యం ఆమడ దూరం

గత ఏడాది జూన్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ఏడాది మే నెలాఖరు నాటికి పునాది, లింటల్ తదితర దశల్లోని 9,107 ఇళ్లను పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. రూ.1.80 లక్షలకు గాను ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు అదనంగా రూ.50 వేలు సాయాన్ని ప్రకటించింది. కాగా సిమెంట్, ఐరెన్, ఇటుక తదితర నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడంతో రూ.5 లక్షలు ఉంటేనే గాని ఇంటి నిర్మాణం పూర్తికాని పరిస్థితి. ప్రభుత్వ సాయం చాలడం లేదని లబ్ధిదారులు అంటున్నారు. మరోపక్క సంక్షేమ పథకాల అమలు నిలిచిపోవడంతో పేదల దగ్గర డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారు. త్వరితగతిన ఇళ్లను నిర్మించుకోవాలని హౌసింగ్ అధికారులు ఒత్తిడి తెస్తున్నా ఆర్థిక ఇబ్బందులతో చాలామంది లబ్ధిదారులు ముందుకురాక ఇప్పటివరకు కేవలం 3,434 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. నిర్ణీత లక్ష్యంలో అత్యధికంగా భీమవరంలో 60 శాతం పూర్తి కాగా తాడేపల్లిగూడెం అర్బన్, పోడూరు, పాలకోడేరు, పెంటపాడులో 30 శాతంలోపే పూర్తయ్యాయి.

నెలాఖరుకు పూర్తి చేయాలి

రెండు రోజుల క్రితం ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. ఇళ్ల నిర్మాణంలో జిల్లా రాష్ట్రంలో 14వ స్థానంలో ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. మిగిలిన 5,721 ఇళ్లను నెలాఖరు నాటికి పూర్తి చేసేందుకు అధికారులు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

గత ప్రభుత్వంలో ఉద్యమంలా..

సొంతిల్లు లేని పేదలు ఉండకూడదన్న లక్ష్యంతో మునుపెన్నడూ లేనివిధంగా జిల్లాలోని 626 లేఅవుట్లలో 47,362 మందికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పంపిణీ చేసింది. సొంతంగా స్థలం ఉన్న పేదలకు 22,757 మందితో మొత్తం 70,119 మందికి ఇళ్లను మంజూరు చేసింది. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు సాయం అందించడంతో పాటు ఇంటి నిర్మాణంలో వారికి అండగా నిలిచింది. డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్న లబ్ధిదారులకు అదనంగా రూ.35,000 రుణ సాయాన్ని అందించింది. సబ్సిడీపై ఐరెన్, సిమెంట్, ఉచితంగా ఇసుకను అందజేసింది. పేదలపై రవాణా చార్జీల భారం పడకుండా లే అవుట్ల సమీపంలోనే వీటి స్టాక్ పాయింట్లను ఏర్పాటుచేసింది. పనుల వేగవంతానికి కోట్లాది రూపాయలు వెచ్చించి జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేసింది. అప్పట్లో దాదాపు 28 వేల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయి.

జిల్లాలో ఇళ్ల నిర్మాణ ప్రగతి

మండలం	లక్ష్యం	నిర్మించినవి	నిర్మించాల్సినవి
భీమవరం	274	165	109
కాళ్ల	177	105	72
పెనుగొండ	429	224	205
ఇరగవరం	254	127	127
మొగల్తూరు	282	134	148
ఆచంట	379	175	204
తాడేపల్లిగూడెం	628	287	341
తణుకు అర్బన్	273	119	154
అత్తిలి	187	80	107
ఆకివీడు అర్బన్	272	114	158
తణుకు	581	227	354
ఉండి	399	155	244
గణపవరం	300	112	188
నరసాపురం	412	149	263
యలమంచిలి	359	124	235
ఆకివీడు	314	108	206
వీరవాసరం	260	89	171
పాలకొల్లు అర్బన్	94	31	63
పాలకొల్లు	200	64	136
నర్సాపురం అర్బన్	172	55	117
పెనుమంత్ర	512	161	351
పాలకోడేరు	376	113	263
భీమవరం అర్బన్	332	99	233
పెంటపాడు	443	117	326
పోడూరు	549	138	411
తాడేపల్లిగూడెం అర్బన్	649	162	487

కేసులతో భయపెట్టలేరు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ముదునూరి. చిత్రంలో పాలకొల్లు సమన్వయకర్త గోపి

యలమంచిలి: వైఎస్సార్ సీపీ నాయకులను తప్పుడు కేసులతో భయపెట్టలేరని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసాపురం మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీపై నెల రోజుల వ్యవధిలో ఐదు కేసులు పెట్టడంతో ఆదివారం ఆయన్ను ప్రసాదరాజు కలిసి సంఘీభావం తెలిపారు. కూటమి నాయకులు అధికారం అడ్డం పెట్టుకుని పోలీసు కేసులు పెట్టగలరేమో కానీ, న్యాయస్థానంలో వాటిని రుజువు చేయలేరని ముదునూరి అన్నారు. ఇటువంటి కేసులకు వైఎస్సార్ సీపీ శ్రేణులు భయపడరని స్పష్టం చేశారు. పార్టీ కోసం పనిచేస్తున్న వారిని ఎన్ని ఇబ్బందులు పెట్టినా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తారని చెప్పారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని, కోర్టులో చివరికి న్యాయమే గెలుస్తుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), పాలకొల్లు పట్టణ అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కొరగింజల హనుమంతరావు, దిద్దే చిట్టిబాబు, చోడగిరి రమేష్, చెన్ను విజయ్, పాలపర్తి కృపనాథ్, రావి పృధ్వీ తదితరులు ఉన్నారు.

కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువు



పెదఅమిరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

కాళ్ల: కూటమి ప్రభుత్వ పాలనలో మాతృమూర్తులకు రక్షణ లేకుండా పోయిందని, రాష్ట్రంలో మహిళలపై పోలీసులు వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పెదఅమిరంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో ఎమ్మెల్సీ కవురు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందోని మండిపడ్డారు. దేశంలో ఓ పక్క యుద్ధ వాతావరణం నెలకొంటే.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మాత్రం ప్రతిపక్ష పార్టీ నాయకులపై కేసులు పెట్టి అరెస్టులు చేయడానికి చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయడం లేదన్నారు. మాజీ మంత్రి, బీసీ మహిళపై ఓ సీఐ దౌర్జన్యంగా ప్రవర్తించడాన్ని అందరూ గమనించాలన్నారు. అలాగే ఓ దళిత మహిళను వేకువజామున నిబంధనలకు విరుద్ధంగా అరెస్టు చేయడం దుర్మార్గపు చర్యని ఖండించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ కర్ర జయచరిత మాట్లాడుతూ ఎస్సీ మహిళ కల్పనను కనీసం బట్టలు మార్చుకునేందుకు కూడా అవకాశం ఇవ్వకుండా వేకువజామున పోలీసులు స్టేషన్‌కు తీసుకువెళ్లడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతి పౌరుడికి ప్రశ్నించే హక్కు ఉందని, మాజీ మంత్రి విడుదల రజిని ప్రశ్నిస్తే ఆమెపై కూడా కేసు పెడతానని అనడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. మహిళలను గౌరవిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి ఎక్కడికి వెళ్లారని, మహిళలకు రక్షణ కల్పిస్తానన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోం మంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బీసీ మహిళ, మాజీ మంత్రి విడదల రజినీపై దౌర్జన్యం చేసిన సీఐపై కఠిన చర్యలు తీసుకోవాలని, దీనిపై కోర్టును ఆశ్రయిస్తామన్నారు. పార్టీ రాష్ట్ర మహిళా విభాగం సెక్రటరీ పాలవెల్లి మంగ, జిల్లా మహిళా అధ్యక్షురాలు కోడె విజయలక్ష్మి, పసుపులేటి కుమారి, కోడె యుగంధర్, బి.ఉమామహేశ్వరరావు, ఎం.చిట్టిబాబు, వీర మల్లికార్జునరావు, చిన్న మధు, భీమవరం పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆస్తుల పరిరక్షణ

- హైకోర్టు ఆదేశాలతో చర్యలు
- కేటగిరీ వారీగా ఆస్తుల విభజన
- ఆక్రమణల తొలగింపు.. కేసుల నమోదు
- జిల్లాలో హైపవర్ కమిటీ ఏర్పాటు
- జిల్లా 409 గ్రామ పంచాయతీలు



విస్సాకోడేరు గ్రామ సచివాలయం

భీమవరం(ప్రకాశం చౌక్): ఆక్రమణల చెరలో ఉన్న గ్రామ పంచాయతీల భూములు, ఆస్తుల పరిరక్షణకు హైకోర్టు ఉత్తర్వులు అమలు చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలతో జిల్లా యంత్రాంగం రంగంలోకి దిగనుంది. ఇటీవల కలెక్టర్ సీహెచ్ నాగరాణి జిల్లాలో హైపర్ కమిటీ ఏర్పాటు చేసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పంచాయతీ భూమి, ఆస్తులు ఆక్రమణలను గుర్తించడం, వాటిని తొలగించడం, బాధ్యులపై కేసులు నమోదు తదితర చర్యలపై హైపర్ కమిటీకి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. పంచాయతీ భూమి ఆక్రమణను గుర్తించిన వెంటనే పోలీసుల సహకారంతో పంచాయతీ అధికారులు ఆక్రమణలు తొలగిస్తారు. సమస్యలు తలెత్తితే హైపర్ కమిటీలోని అధికారులు చర్యలు తీసుకుంటారు. ప్రతి మూడు నెలలకోసారి హైపర్ కమిటీ సమావేశమై ఆక్రమణల గుర్తింపు, తొలగింపు పురోగతిని సమీక్షిస్తుంది. అలాగే ప్రతినెలా డివిజన్ పంచాయతీ అధికారి సమీక్షిస్తారు. వీరిచ్చే నివేదిక ఆధారంగా రెండు నెలలకు ఓసారి జిల్లా పంచాయతీ అధికారి కేసులను సమీక్షిస్తారు.

జిల్లాలోని 409 పంచాయతీల్లో..

పశ్చిమగోదావరి జిల్లాలో 409 పంచాయతీలు ఉండగా.. పలు ప్రాంతాల్లో పంచాయతీల ఆస్తులు ఆక్రమణలకు గురయ్యాయి. పంచాయతీ భూములు, చెరువులు, డ్రెయిన్లను ఆక్రమించుకుని ఇళ్లు, షాపుల నిర్మాణం, లేఅవుట్లలోని పంచాయతీ భూమిని కలుపుకుని ప్లాట్ వేసి విక్రయించడం, పంచాయతీకి చెందిన భూమి పాడుకుని పాట చెల్లించకుండా స్వాధీనం చేసుకోవడం వంటి అతిక్రమణలు ఉన్నాయి.

పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు

ప్రతి సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పంచాయతీల్లో ఆక్రమణలపై పలు ఫిర్యాదులు అందుతున్నాయి. జిల్లాలోని 20 మండలాల్లో ప్రతివారం మూడు, నాలుగు పంచాయతీల ఆక్రమణలపై ఫిర్యాదులు వస్తున్న క్రమంలో హైకోర్టు ఉత్తర్వులతో జిల్లా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. పంచాయతీకి చెందిన ఆస్తులు, భూములను మూడు వర్గాలుగా విభజించారు.

పంచాయతీ ఆస్తుల వర్గీకరణ

ఏ కేటగిరీ : సొంత, భూసేకరణలోని ఆస్తులు, సాధారణ రోడ్లు, డ్రెయిన్లు, పశువుల షెడ్లు, సాధారణ మార్కెట్ ప్రాంతాలు, లేఅవుట్లలోని 10 శాతం ఖాళీ స్థలాలు, పార్కులు, పంచాయతీ కొనుగోలు చేసిన భూములు.

బీ కేటగిరీ : బహుమతులు, విరాళాలు, పంచాయతీలకు భూముల బదిలీ ద్వారా వచ్చిన ఆస్తులు తదితరాలు.

సీ కేటగిరీ : పంచాయతీల్లోని వాటర్ వర్క్స్, రిజర్వాయర్లు, ట్యాంకులు, సిస్టర్న్‌లు, ఫౌంటేన్లు, బావులు, పైపులు, పంచాయతీరాజ్ చట్టంలోని మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, ట్యాంక్ బండ్‌లు, నీటివనరులు, పోరంబోకు భూములు (మేత భూములు, నూర్పిడి అంతస్తులు), శ్మశాన వాటికలు, పశువుల స్టాండ్లు, బండి స్టాండ్లు. ఏ, బీ కేటగిరీల రక్షణ బాధ్యత పంచాయతీలది కాగా.. సీ కేటగిరీ రక్షణ బాధ్యత పంచాయతీతో పాటు రెవెన్యూ శాఖది.

రోడ్లు, కాలువ గట్ల ఆక్రమణలపై సర్వే

పంచాయతీ పరిధిలోని ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా, కాలువలు, డ్రెయిన్ల ఆక్రమణలపై సర్వే చేసి జాబితా రూపొందించాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారు. ఈ మేరకు అధికారులు సర్వే పనులు చేపట్టారు.

హైపర్ కమిటీ

హైపర్ కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారు. జాయింట్ కలెక్టర్, జిల్లా ఎస్పీ, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి, ఇరిగేషన్, సర్వే, ఆర్ అండ్ బీ, మైనింగ్ తదితర శాఖల జిల్లా అధికారులు కమిటీ సభ్యులుగా ఉంటారు.

పారదర్శకంగా సాధ్యమేనా?

పంచాయతీల్లో ఆక్రమణలు తొలగింపు అధికారులకు సాధ్యమవుతుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు తొలగింపులకు అడ్డుపడితే అధికారులు ముందుకు వెళ్లగలరా అన్నది అనుమానమే. పంచాయతీ ఆస్తుల పరిరక్షణలో కలెక్టర్, హైపర్ కమిటీ ఈ మేరకు విజయవంతం అవుతారో వేచి చూడాలి.

క్లుప్తంగా

గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు


గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునుంచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, మచిలీపట్నం, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వాహనాలతో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

పెద్దింట్లమ్మా చల్లంగా చూడమ్మా


కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద భక్తులు

కైకలూరు: అమ్మా.. పెద్దింట్లమ్మా.. నీ చల్లని ఆశీస్సులు అందించమ్మా.. అంటూ భక్తులు అమ్మను ఆర్తితో వేడుకున్నారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మను సమీప జిల్లాల నుంచి భారీగా భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. కోనేరులో పవిత్ర స్నానాలు ఆచరించి నైవేద్యాలు సమర్పించారు.

వైభవంగా మీసాల వెంకన్న కల్యాణోత్సవం


మీసాల వెంకన్న కల్యాణోత్సవం

కైకలూరు: భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి(మీసాల వెంకన్న) దేవాలయంలో వార్షిక బ్రహోత్సవాలు అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. ఉదయం స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచన, నిత్యహోమం, చతుర్థశ కలశస్థాపన అనంతరం మాడ వీధులలో శేష వాహనంపై స్వామివారిని ఊరేగించారు. రాత్రి భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణం కనులపండువగా జరిగింది. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ క్రతువును శ్రీనివాసుల లక్ష్మణ ప్రవీణ్, లక్ష్మీనరసింహాచార్యులు, మిథునాచార్యులు, గోపి కృష్ణమాచార్యులు నిర్వహించారు. ఆలయ ఈవో వీఎన్‌కే శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం


పంతంగలగూడెంలో బెల్లపు ఊట ధ్వంసం చేస్తున్న అధికారులు

చింతలపూడి: స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పంతంగలగూడెంలో నాటు సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. బట్టి నిర్వహిస్తున్న ఇస్లావతు కోటేశ్వరరావుపై పరారీ కేసు నమోదు చేసినట్లు సీఐ పి.అశోక్ తెలిపారు.

ఆక్వాపై యుద్ధం ఎఫెక్ట్

- కౌంట్‌కు రూ.10 తగ్గించిన ఎగుమతిదారులు
- నిన్నటి వరకూ అమెరికా సుంకాల పేరుతో దోపిడీ
- కూటమి ప్రభుత్వంలో భారంగా ఆక్వా సాగు


బువ్వనపల్లిలో రొయ్యల పట్టుబడులు


కొమ్మరలో ఆక్సిజన్ కోసం తిరుగుతున్న విద్యుత్ ఏరియేటర్లు

నిడమర్రు: ఇప్పటికే దళారుల దెబ్బకు రొయ్య రైతులు ఇబ్బంది పడుతుంటే కొత్త కష్టాలు వచ్చిపడ్డాయి. భారత్– పాకిస్తాన్ యుద్ధం బూచిగా చూపి రొయ్య ధరల్లో రూ.10 వరకూ కంపెనీలు కొత విధించాయి. ఆదివారం పట్టుబడులకు సిద్ధమైన రైతులు శనివారం ధరలతో పోల్చితే కిలోకు రూ.10 తగ్గిస్తున్నామని చెప్పడంతో కంగుతిన్నారు. పట్టుబడికి వలలు, ఐస్, కూలీలు, ట్రాన్స్‌పోర్ట్ సిద్ధం చేసుకోవడంతో తప్పనసరి పరిస్థితుల్లో తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వచ్చింది.

కూటమి ప్రభుత్వంలో గడ్డు పరిస్థితులు

గత కొంత కాలంగా రొయ్య ధరలు నిలకడగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల అమెరికా సుంకాల పేరుతో దళారులు. రొయ్య ధరలు తగ్గించారు. సుంకాలు చెల్లింపులు వాయిదా వేసినా రొయ్య ధరలు పెరిగేలా చర్యలు తీసుకోవడంలో కూటమి ప్రభుత్వం తీవ్రగా విఫలమైందని ఆక్వా రైతులు చెపుతున్నారు. మేత ఖర్చు పెరగడం, దళారులు కుమ్మక్కై ధరలను శాసిస్తుండడం రైతులకు శాపంగా మారింది. అమెరికా సుంకాల విషయంలో వెనక్కి తగ్గడంతో యథావిధిగా ధరలు ఉంటాయని ఆక్వా రైతులు ఆశించారు. ఎగుమతిదారులు, దళారులు దీన్ని ఆసరాగా తీసుకుని ధరలు తగ్గిస్తున్నారు. మరోసారి రొయ్య ధరలు తగ్గించేందుకు భారత్-పాక్ యుద్ధం ప్రభావాన్ని సాకుగా చూపుతున్నారు. ఈ యుద్ధ ప్రభావంతో ఎగుమతులు నిలిచిపోతాయంటూ.. రొయ్య ధరల్లో మరింత తగ్గుదలకు అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆక్వా సాగుపై ప్రజలకు ఆసక్తి తగ్గిపోతోంది. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా పలు కుటుంబాల ఉపాధి కోల్పోతాయి.

రొయ్య ధరలు రూ.లలో

కౌంట్	ధర (శనివారం)	ధర (ఆదివారం)
100	235	225
90	245	235
80	265	255
70	285	275
60	310	300
50	330	320
40	350	340
30	430	420

భారంగా విద్యుత్ చార్జీలు

ఆక్వా జోన్‌లు ఏర్పాటు చేసి గత ప్రభుత్వం విద్యుత్ రాయితీలు ఇచ్చేలా ప్రోత్సహించింది. దీనిని కొనసాగించేలా కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు తగ్గించేలా ఆదేశాలిచ్చింది. అయితే విద్యుత్ శాఖ మాత్రం గతంలో రాయితీ ఇచ్చిన సోమ్మును తిరిగి కట్టించుకునేలా వ్యవహరిస్తోంది. టారిఫ్‌ల పేరుతో ప్రతి బిల్లులో ట్రూ ఆఫ్ చార్జీలను వసూలు చేస్తోందని రైతులు విమర్శిస్తున్నారు. వేసవి తీవ్రతతో పాటు ఇటీవల వాతావరణం మార్పులతో చెరువుల్లో ఆక్సిజన్ కొరతను నివారించేందుకు నిరంతరం ఏరియేటర్లు తిప్పాల్సిన పరిస్థితి ఉంది. గత ప్రభుత్వ హయాంలో లెక్కలను పరిశీలిస్తే ఉంగుటూరు నియోజకవర్గంలో ఆక్వా సబ్సిడీ విద్యుత్ సర్వీసులు 3,908 ఉన్నాయి. ఈ సర్వీసులకు సంబంధించి 2019 నుంచి 2024 వరకూ రూ.258.52 కోట్లు మేర జగన్ ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ అందించి రొయ్య రైతులను ఆదుకుంది.

యుద్ధం పేరుతో రూ.10 తగ్గించారు



రొయ్య 90 కౌంట్‌కు చేరుకోవడంతో ఆదివారం ఉదయం పట్టుబడులకు సిద్ధం చేసుకున్నా. శనివారం 90 కౌంట్ ధర రూ.245గా ఉంది. ఆదివారం రూ.10 తగ్గింది. ధరలు నిలకడగా లేకపోవడంతో పట్టుబడులకు సిద్ధమైన అనేక మంది రైతులు అన్ని విధాలుగా నష్టపోతున్నారు.

– అలుమోలు గంగారాం, ఆక్వా రైతు, బువ్వనపల్లి

సాగు కష్టంగా ఉంది



గతంలో ఆక్వా సాగుకు ప్రోత్సాహం ఉండేది. నేడు రాయితీలు లేవు. ధరలు నిలకడగా లేకపోవడంతో సాగు చేయలేకపోతున్నాం. ఒకవైపు వైరస్‌లు, మరో వైపు మేత ధరలు నిలకడగా లేకపోడం, విద్యుత్ భారంతో నలిగిపోతున్నాం. ఏదొక కారణం బూచిగా చూపిస్తూ ధరలు తగ్గించేస్తున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

–అలుమోలు అంతిర్వేది, ఆక్వా రైతు, బువ్వనపల్లి


చెట్టును ఢీకొని యువకుడి మృతి

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని దిగమర్రు పరిధిలో ఓ యువకుడు చెట్టును ఢీకొట్టి మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం నిడదవోలు మండలం అట్లపాలెం గ్రామానికి చెందిన తాళ్లూరి జాన్ (25) అమలాపురంలో బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో నిడదవోలు వెళ్తుండగా.. మధ్యలో దిగమర్రు ప్రాంతంలో చెట్టును ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయమైంది. అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై బి సురేంద్రకుమార్ తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు లక్కవరం ఎస్సై డి.శశాంక తెలిపారు. మండలంలోని నాగులగూడెంకు చెందిన ఇంగుర్తి చిన్నారి భర్తతో విడిపోయి.. కుమారుడితో కలిసి తల్లి వద్ద ఉంటోంది. శనివారం సాయంత్రం మందులు తెచ్చుకోవడానికి కుమారుడితో కలిసి బయటకు వెళ్లింది. ఇంటికి మనువడు ఒక్కడే రావడంతో చిన్నారి తల్లి పల్లమ్మ చుట్టుపక్కల వాకబు చేసినా ఫలితం లేదు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రాట్నాలమ్మకు రూ.78,113 ఆదాయం


ప్రత్యేక పూల అలంకరణలో రాట్నాలమ్మ

పెదవేగి: రాట్నాలమ్మకు భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ వారం అమ్మవారికి పూజా టిక్కెట్లపై రూ.47,320, విరాళంగా రూ.3,928, లడ్డూ ప్రసాదంపై రూ.24,450, ఫొటోల అమ్మకంపై రూ.2,415 కలిపి మొత్తం రూ 78,113 ఆదాయం లభించిందని దేవస్థానం ఈవో చెప్పారు.

వలస పక్షుల స్వర్గం కొల్లేరు


గ్రేట్ స్నైప్


ఆర్కిటిక్ టర్న్


బార్ హెడెడ్ గూస్


బార్ టెయిల్డ్ గాడ్విట్

- నేడు అంతర్జాతీయ వలస పక్షుల దినోత్సవం
- కొల్లేరుకు ఏటా 1.20 లక్షల విదేశీ వలస పక్షులు
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ముప్పు


కొల్లేరు అభయారణ్యంలో పక్షులు

కైకలూరు: వలస పక్షులకు స్వర్గధామం కొల్లేరు.. ఆంధ్రప్రదేశ్‌లో కొల్లేరు, తేలుకుంచి, తేలి నీలాపురం, నేలపట్టు, ఉప్పలపాడు, ఆటపాక, రోళ్ళపాడు, కొండకర్ల, కోరింగ వంటి ప్రాంతాలు పక్షుల విడిది కేంద్రాలుగా వినుతికెక్కాయి. ప్రధానంగా కొల్లేరు అభయారణ్య ప్రాంతానికి ఏటా శీతాకాలంలో లక్షలాది వలస పక్షులు సంతానోత్పత్తి కోసం వస్తాయి. మే రెండో వారంలో అంతర్జాతీయ వలస పక్షుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కథనం..

ప్రపంచ వ్యాప్తంగా మొత్తం పక్షి జాతులు 11,000 ఉండగా వీటిలో వలస పక్షి జాతులు 4,000 ఉన్నాయి. సుదూర ప్రాంతాలకు వలస వెళ్లే పక్షి జాతులు 18,00 పైగానే గుర్తించారు. భారత దేశానికి వలస వచ్చే పక్షి జాతులు 1,349 ఉన్నాయి. వీటిలో 683 పక్షి జాతులు ప్రమాదం అంచున ఉన్నాయని అధ్యయనాలు చెబుతోన్నాయి. సైబీరియా, రష్యా, టర్కీ, తూర్పు యూరోప్ వంటి 29 దేశాల నుంచి వలస పక్షులు విడిది కోసం వస్తాయి.

కొల్లేరులో విడిది.

కొల్లేరు అభయారణ్యంలో వివిధ జాతులకు చెందిన 105 రకాల పక్షి జాతులు ఉన్నట్లు ఆసియన్ వాటర్ బర్డ్స్ సెన్సెస్‌లో వెల్లడైంది. కొల్లేరు అభయారణ్యానికి ఏటా 3 లక్షల నుంచి 4 లక్షల పక్షులు విహారానికి వస్తుంటాయి. వీటిలో సుమారు 1.20 లక్షల పక్షులు విదేశాల నుంచి విడిది కోసం వస్తాయి. కొల్లేరు ప్రాంతానికి రష్యా, బ్రిటన్, మాల్దీవులు, సైబీరియా, బంగ్లాదేశ్, నైజీరియా, ఆస్ట్రేలియా, శ్రీలంక తదితర 29 దేశాల నుంచి వివిధ వలస జాతి పక్షులు వస్తాయి. శీతాకాలంలో సంతానోత్పత్తి చేసుకుని తిగిరి స్వస్థలాలకు వెళతాయి. పక్షుల సంచరించే ×సెంట్రల్ ఏషియన్ ఫ్లెవై(సీఏఎఫ్) కొల్లేరు మీదుగా వెళ్లడంతో పక్షులకు ఈ ప్రాంతం అనుకూలంగా మారింది.

పక్షులకు పొంచి ఉన్న ప్రమాదాలు

వాతావరణ మార్పులు వలస పక్షుల జీవనంపై ప్రభావం చూపుతోంది. సగటు ఉష్ణోగ్రతల్లో 1 డిగ్రీ పెరిగితే పక్షుల ఉనికికి ముప్పు. రానున్న రోజుల్లో ఇది 2 డిగ్రీలకు పెరిగే అవకాశం ఉందని వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ హెచ్చరిస్తోంది. ఇప్పటికే విదేశాల నుంచి కొల్లేరు వలస వచ్చే వైట్ బ్యాక్డ్ రాబందు, సైబీరియన్ క్రేన్, బెంగాల్ ఫ్లోరికన్ వంటి పక్షి జాతులు కనిపించడం లేదు. పెరుగుతున్న జనాభా, తరుగుతున్న అడవులు, మిరిమిట్లు గొలిపే కాంతులు, ఆహారపు కొరత పక్షుల ప్రాణాలను బలిగొంటున్నాయి. ప్రధానంగా భూతాపం పెరిగి రుతువుల రాకపోకల్లో తలెత్తే మార్పులు పక్షులకు ప్రాణ సంకటంగా మారుతుంది.

వలస పక్షులలో ఇవే ప్రధానం

- నిర్విరామంగా అత్యధిక దూరం ప్రయాణించే పక్షి బార్ టెయిల్డ్ గాడ్విట్. ఈ పక్షి ఎక్కడా ఆగకుండా 11 వేల కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. కొల్లేరు అభయారణ్య ప్రాంతానికి ఏటా వస్తాయి.
- అత్యధిక దూరం వలసపోయే పక్షి ఆర్కిటిక్ టర్న్. ఏకంగా 12,200 కిలోమీటర్ల దూరాన్ని కేవలం ఎనిమిదిన్నర రోజుల్లోనే చేరుకుంటుంది. అలస్కా నుంచి న్యూజిలాండ్‌కు వలస వెళ్తుంది.
- ఎక్కువ ఎత్తున ఎగిరే వలస పక్షి బాతు జాతికి చెందిన బార్ హెడెడ్ గీస్. ఇది సముద్రమట్టానికి దాదాపు 8.8 కిలోమీటర్ల ఎత్తున ఎగురుతుంది. ఈ జాతికి చెందిన పక్షులు హిమాలయాల నుంచి ప్రయాణించి, భారత భూభాగంలోని చిలుకా, పులికాట్ తదితర సరస్సులకు వస్తాయి.
- అత్యధిక వేగంగా ప్రయాయాణించే వలస పక్షి గ్రేట్ స్నైప్. ఈ పక్షి గంటకు 96.5 కిలోమీటర్ల వేగంతో దాదాపు 6,500 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది.

కొల్లేరు సరస్సుకు వచ్చే పక్షులు

కొల్లేరు సరస్సుకు రోజీ స్టార్ లింగ్, గుల్–బిల్డిడ్ టర్న్, బ్రౌన్ హెడెడ్ గుల్, లిటిల్ రింగ్డ్ ప్లోవర్, మార్స్ శాండ్ పైపర్, గాడ్ విల్, రెడ్ క్రిస్టడ్ పోచర్డ్, పసిపిక్ గొల్డెన్ ప్లోవర్, నార్తరన్ పిన్‌టైల్, బ్రాహ్మణి షెల్ డక్, స్పాట్ బిల్డ్ డక్, మలార్డ్ వంటి పలు విదేశీ పక్షుల ఏటా వలస వస్తున్నాయి.

పక్షులు మంచి నేస్తాలు



పక్షులను అందరం మంచి నేస్తాలుగా భావించాలి. కొల్లేరు అభయారణ్యం పక్షుల విడిది కేంద్రంగా వినుతికెక్కింది. ఆటపాక, మాధవపురంలో పక్షుల సంరక్షణ కేంద్రాలను అటవీశాఖ నిర్వహిస్తోంది. ఈ ఏడాది అధిక సంఖ్యలో పక్షులు కొల్లేరుకు వచ్చాయి.

బి.విజయ, జిల్లా అటవీశాఖ అధికారి, ఏలూరు.

ముగిసిన తెలుగు సాహితీ సంబరాలు


ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, కవులు, కళాకారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీ శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఏలూరులో రెండ్రోజుల పాటు నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు ఘనంగా ముగిశాయి. ఆదివారం ముగింపు కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. కవి సమ్మేళనాలు, పుస్తకావిష్కరణలు, సదస్సులు, నాటికలు, ఏకపాత్రాభినయాలు, మ్యాజిక్, కూచిపూడి, భరతనాట్యం, తదితర ప్రదర్శనలతో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన కవులు, కళాకారులు తమ కవితలు, ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నర్సిపల్లి హరిక మాట్లాడుతూ ఇలాంటి బృహత్తర కార్యక్రమంతో తెలుగు భాష పరిఢవిల్లుతుందన్నారు. విశిష్ట అతిథి ఏపీ ఎస్‌ఆర్‌టీ మాజీ డైరెక్టర్ చప్పిడి రాజశేఖర్, బోళ్ళ సతీష్ బాబులు మాట్లాడుతూ ఇలాంటి రికార్డు కార్యక్రమాలు చేయడం శ్రీ శ్రీ కళావేదికకే సాధ్యమన్నారు. ప్రోగ్రాం కన్వీనర్ పార్థసారథిని ఘనంగా సన్మానించారు. శ్రీ శ్రీ కళా వేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాతీయ అధ్యక్షురాలు జీ. ఈశ్వరీ భూషణం, చిట్టే లలిత, డెబా విజయ్ కుమార్, నల్లా భాగ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం.. విద్యార్థిని ఆత్మహత్య


ఆందోళన చేస్తున్న మృతురాలి తల్లి దండ్రులు, పీడీఎస్‌యూ, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నేతలు

ఏలూరు టౌన్: ఏలూరులో విద్యార్థినిని ప్రేమ పేరుతో మోసం చేయడంతో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. మూడు రోజులుగా ఏలూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున విద్యార్థిని తుంపాల మాధవి మృతిచెందింది. దీంతో విద్యార్థిని కుటుంబ సభ్యులు, పీడీఎస్‌యూ నాయకులు, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకుల ఆధ్వర్యంలో ఏలూరు జీజీహెచ్ వద్ద ఆందోళన చేపట్టారు. టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. విద్యార్థిని మృతదేహానికి శవ పంచనామా చేసి బంధువులకు అప్పగించారు. సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నగర ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ.. ఐదేళ్ల నుంచి గెద్దం సంతోష్ మాధవితో సన్నిహితంగా మెలిగి.. ఇప్పుడు పెళ్లి చేసుకునేందుకు నిరాకరించాడని తెలిపారు. ఇరు పక్షాల పెద్దల సమక్షంలో పెళ్ళి చేసుకోవాలని కోరినా నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో మాధవి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుందన్నారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ.. పాస్టర్ గెద్దం లూకరాజు కుమారుడు ప్రశాంత్ ప్రేమ పేరుతో మోసం చేస్తే దాన్ని సరిచేయకపోగా, తప్పును ప్రోత్సహించారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థిని మృతికి కారకుడైన యువకుడు, అతని తల్లిదండ్రులను శిక్షించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

యువకుడు సంతోష్ అరెస్టు

విద్యార్థిని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ సంఘటనపై ఏలూరు రూరల్ ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి మాధవి మృతికి కారకుడైన గెద్దం సంతోష్‌ను అరెస్ట్ చేశారు.

చికిత్స పొందుతూ భార్య మృతి


మృతురాలు సంధ్య


ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న మృతురాలి బంధువులు, స్థానికులు

పాలకొల్లు సెంట్రల్: తనను ఆర్థికంగా మోసగించారన్న మనస్తాపంతో దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో భార్య మృతి చెందింది. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన మాదు శ్రీనివాస్ దంపతులు ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేయగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం భార్య సంధ్య (23) మృతి చెందడంతో బంధువులు విషాదంలో మునిగిపోయారు. దగ్గర బంధువైన కిట్టుకు 20 ఏళ్ల క్రితం నగదు ఇచ్చాడని ఆ నగదుతో పొలం కొన్నారని బంధువులు తెలిపారు. తాను అప్పుల్లో ఉన్నానని తన వాటాగా ఎంత వస్తే అంత ఇవ్వాలని కిట్టును శ్రీనివాస్ అడగ్గా.. ఇచ్చేది లేదని చెప్పడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. మేకా రామకృష్ణ (కిట్టు) వల్ల ఒక కుటుంబం నాశనమైందని బంధువులు ఆరోపించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు, స్థానికులు ఆస్పత్రి వద్ద ధర్నా చేశారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం


తణుకులో మంటలు చెలరేగిన రామకృష్ణ టవర్స్


గదిలో కమ్మేసిన పొగ

తణుకు అర్బన్: తణుకులో ఆదివారం ఒక అపార్ట్‌మెంట్‌లో జరిగిన అగ్నిప్రమాదంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. తంగిరాల వారి వీధిలోని ఇండియన్ పబ్లిక్ స్కూలు సమీపంలో ఉన్న రామకృష్ణ టవర్స్‌లో 302 ఫ్లాట్‌లో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బెడ్‌రూంలో ఏర్పడిన మంటలు ఫ్లాట్ మొత్తం కమ్మేయడంతో దట్టమైన పొగ వ్యాపించింది. 4, 5 ఫ్లోర్‌లో ఉన్న కుటుంబాలు పైకి చేరుకోగా కింది ఫ్లాట్‌లో ఉన్న కుటుంబాలు సెల్లార్‌లోకి వెళ్లిపోయాయి. ఈ భవనంలో 10 ఫ్లాట్‌లు ఉండగా ప్రమాద సమయంలో మెట్ల మార్గంలో పొగ కమ్మేయడంతో కొందరు ఫ్లాట్‌ల్లోనే ఉండిపోయారు. మంటలు చెలరేగిన ఫ్లాట్‌లో నివసిస్తున్న వి.శ్రీలక్ష్మి ప్రమాద సమయంలో బయటకు వెళ్లగా ఇంట్లో వృద్ధురాలితోపాటు పనివారు ఉన్నారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వచ్చి మంటలను అదుపు చేశారు. సమయానికి మంటలను అదుపుచేసిన అగ్నిమాపక సిబ్బంది సేవలను కొనియాడారు. బెడ్‌రూంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లుగా చెబుతున్నారు. రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారి అజయ్ కుమార్ తెలిపారు.

క్లుప్తంగా

సోలార్ పవర్ సిస్టం కోసం వినతి



పాకా సత్యనారాయణను సత్కరిస్తున్న న్యాయవాదులు, బీసీ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక బార్ అసోసియేషన్‌కు సోలార్ పవర్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపీ అభ్యర్థి పాకా సత్యనారాయణకు తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శిరిగినీడి విజయకృష్ణ ఆదివారం వినతిపత్రం సమర్పించారు. సీనియర్ న్యాయవాది బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గొల్లపూడి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, బీసీ జేఏసీ నాయకుడు చెన్న జనార్ధనరావు హాజరయ్యారు. అనంతరం పాకా సత్యనారాయణను సత్కరించారు.

'సత్యసాయి' సేవలు అభినందనీయం



ఉచిత వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయి మందిరంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. సత్యసాయి సేవా సమితి సేవలను పలువురు వక్తలు కొనియాడారు. కన్వీనర్ ఎంఎస్ఎస్‌కే జనార్ధనరావు పర్యవేక్షణలో హైదరాబాద్‌కు చెందిన గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ఎంఎస్ఎస్‌వీ మురళీకృష్ణచే ఉచిత వైద్య సేవలు అందించారు. సుమారు 100 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి ఉచిత మందులు అందజేశారు. రాగు ఇంద్రేశ్వరరావు, కె.మల్లిఖార్జునరావు, గౌతు సూర్యచంద్రరావు, పాలూరి రాంబాబు, అల్లూరి సీతారామరాజు, ఆలపాటి త్రినాథ్‌రావు, వడ్డి శ్రీనివాసరావు, ఫణి, లక్ష్మి, మంగతాయరు, రామలక్ష్మి తదితర సేవాదళ్ సభ్యులు సేవలను అందజేశారు.

నేడు కాళ్లకూరు వెంకన్న రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కాళ్ల: కాళ్లకూరు గ్రామంలో వేంచేసియున్న స్వయంభు శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం స్వామి, అమ్మవార్లకు రథోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ ఎం.అరుణ్ కుమార్ ఆదివారం తెలిపారు. కల్యాణ మహోత్సవాల్లో భాగంగా 6వ రోజు ఆదివారం స్వామి వారికి సహస్ర కనకాంబర పుష్పార్చన, నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. వైష్ణవ నృసింహ జయంతి పర్వదినం పురస్కరించుకొని స్వామి వారికి అష్టోత్తర పూజ, వేద సదస్య కార్యక్రమం నిర్వహించి, పందిరి (సర్వభూపాల వాహనం) వాహన సేవ వైభవంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న జ్ఞాన వేదిక సభ్యులు

వీరవాసరం: శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక, భీమవరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం నందమూరు గరువులో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేశారు. గ్రామస్తులకు 101 త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల గురించి వివరించి, జ్ఞాన మార్గాన్ని అనుసరించాలని కోరారు. పౌర్ణమి పూర్ణ దైవ జ్ఞానానికి గుర్తు అని, అలాగే అమావాస్య అజ్ఞానానికి గుర్తని, కావున అజ్ఞానం నుంచి వెలుగు వైపు అనగా దైవ జ్ఞానం వైపు ప్రయాణించాలని వివరించారు. కార్యక్రమంలో ఉదయ్ కుమార్, వాసుదేవ, నాగేశ్వరరావు, రాజు, లోకేష్, మూర్తి, ప్రభాకర్, సత్యనారాయణ, లావణ్య, సుజాత, లక్ష్మి, భవాని, యశోద, తారకేశ్వరి పాల్గొన్నారు.

పింఛను చాలదు.. రుణం రాదు

- చేతులెత్తేసిన బ్యాంకర్లు.. పట్టించుకోని ప్రజా ప్రతినిధులు
- గూడు దక్కేదెలా.. అద్దెలు కట్టలేక వృద్ధ లబ్ధిదారుల సతమతం



నిరుపయోగంగా ఉన్న ఏపీ టిడ్కో గృహాలు

తాడేపల్లిగూడెం అర్బన్: పేదలకు సొంత గూడు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రధాన మంత్రి ఆవాస యోజన (పీఎంఏవై) పథకం కింద గృహాలు నిర్మించి పేద కుటుంబాలకు మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో కొందరు లబ్ధిదారులకు గృహాలు అందినా వయసు మీరిపోవడంతో బ్యాంకు రుణాలు మంజూరు చేయమని బ్యాంకు అధికారులు చేతులెత్తేయడంతో ప్రభుత్వ పింఛనుతోనే బతుకీడుస్తున్న వృద్ధులైన లబ్ధిదారులు దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. వయసు మీద పడటంతో కూలి పనులు చేసుకోలేక సంపాదన లేక ప్రభుత్వం అందించే వృద్ధాప్య పింఛనుతో బతుకు వెళ్లదీస్తున్నారు. సొంత గూడు లేక అద్దె గృహాల్లో ఉంటున్నారు. 2014–19 కాలంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఏపీ టిడ్కో గృహాలు నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. చంద్రబాబు హయాంలో గృహాలు నిర్మాణం పూర్తైనా లబ్ధిదారులకు ఇవ్వలేదు. 2019–2024 కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు టిడ్కో గృహాలను అందజేశారు.

వృద్ధుల పరిస్థితి అయోమయం

చంద్రబాబు హయాంలో లబ్ధిదారులుగా ఎంపికైన పేదలు కొందరు గృహాలు మంజూరు చేసే సమయానికి వయసు మీద పడటంతో బ్యాంకు రుణాలకు అనర్హులయ్యారు. దీంతో ఆ సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనర్హులైన వృద్ధ లబ్ధిదారుల సంతానం ష్యూరిటీ తీసుకుని గృహాలు ఇవ్వాలని ఆదేశించారు. దీంతో మరి కొందరు వృద్ధ దంపతులకు గృహాలు అందలేదు. వారికి అందరూ ఆడ పిల్లలు ఉండటం, వారు వివాహాలు చేసుకొని వెళ్లిపోవడంతో వారికి ష్యూరిటీ ఇచ్చే వారు లేక అయోమయంలో అల్లాడుతున్నారు. భార్య భర్తలు వృద్ధులు కావడంతో అద్దెకు ఇళ్లు ఇవ్వమని, ఖాళీ చేసి వేరే ఇళ్లు చూసుకోవాలని ఆయా అద్దె గృహాల యజమానులు ఒత్తిడి చేస్తున్నారు. వృద్ధులైన భార్య భర్తలు అద్దె ఇళ్ల కోసం వెతుకులాడుతున్నా ఎవరూ అద్దెకు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. అద్దెలు కట్టుకోలేక, ప్రభుత్వం అందించే వృద్ధాప్య పింఛను సరిపోకపోవడంతో మందులు కొనుక్కొనే స్థితి లేక జీవచ్ఛవాల్లా బతుకుతున్నారు.

పూర్తి సొమ్ములు చెల్లిస్తే గృహాలు మంజూరు

ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏపీ టిడ్కో గృహాలు కావాలంటే బ్యాంకు రుణాలకు అనర్హులైన వృద్ధులు పూర్తి సొమ్ములను చెల్లిస్తే గృహాలు ఇస్తామని చెప్పడంతో రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద వృద్ధులు, ప్రభుత్వం అందించే వృద్ధాప్య పింఛనుతో జీవనం సాగించే వృద్ధులు ఎక్కడి నుంచి లక్షల రూపాయలు చెల్లించగలమని ఆవేదన చెందుతున్నారు. ప్రజా ప్రతినిధులను ఆశ్రయించినా నాయకులు అదే సమాధానం చెప్పడంతో వృద్ధ లబ్ధిదారులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.

భార్యాభర్తలమే మిగిలాం



మాకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారికి వివాహాలై వారి కుటుంబాలతో వేర్వేరు ప్రాంతాల్లో జీవిస్తున్నారు. నాకు ఏడాది క్రితం పక్షవాతం వచ్చి కాలు చేయి పని చేయడం లేదు. దీంతో నాకు నా భర్తే దిక్కయ్యారు. ఆయనే నాకు అన్ని సేవలు చేస్తున్నారు. మేము ఉంటున్న ఇంటికి అద్దె కట్టాలి. నాకు, నా భర్తకు మందులు కొనుక్కోవాలి. మాకు మంజూరైన గృహాన్ని ఇస్తే నేను నా భర్త అందులో జీవిస్తాం.

– పైబోయిన అన్నపూర్ణ, తాడేపల్లిగూడెం

జీవచ్ఛవాల్లా బతుకుతున్నాం



మా ఆడ పిల్లలకు వివాహాలై వారి బతుకులు వారు బతుకుతున్నారు. ఇటీవల నా భార్యకు అనారోగ్యం కారణంగా నడలేని స్థితిలో ఉంది. నాకు షుగరు వ్యాధి కారణంగా నేను మందులు తీసుకోవాలి. ఆమెకు మందులు కొనాలి. ఇంటికి అద్దె కట్టాలి. ప్రభుత్వం అందించే రూ.4 వేలతోనే జీవనం సాగిస్తున్నాం. పింఛను సొమ్ములతో జీవచ్ఛవాల్లా బతుకుతున్నాం. ఈ వయసులో కూలి పనులు చేసుకొనే శక్తి లేదు. ప్రభుత్వం మాపై దయ ఉంచి మాకు మంజూరైన ఇంటిని మాకు ఇప్పించండి. చివరి దశలో మా భార్యాభర్తలం కలిసి బతుకుతాం.

– ముత్యాల వీరరాఘవులు, తాడేపల్లిగూడెం

ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి



ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ సాల్మన్ రాజు

వీరవాసరం: ప్రతి ఒక్కరూ సన్మార్గంలో పయనించాలని పాస్టర్ బద్దె సాల్మన్ రాజు ఉపదేశించారు. రాయకుదురు శివారు వీరవల్లి పాలెం దైవ సమాజం చర్చిలోని మాసాంతరంలో రెండో ఆదివారం సందర్భంగా బాప్తిసం పొందిన విశ్వాసులకు ప్రభు రాత్రి సంస్కార భోజనం పేరిట రొట్టె ద్రాక్ష రసం పాస్టర్ సాల్మన్ రాజు అందించారు. అనంతరం సాల్మన్ రాజు ప్రసంగిస్తూ ప్రతి ఒక్కరూ బాప్తిస్మము పొంది ప్రభు రాత్రి సంస్కార భోజనంలో పాలుపంచుకొని నిత్య రాజ్యానికి వారసులు అవ్వాలన్నారు. అలాగే ఈ నెల 24వ తేదీన బైబిల్‌లోని అధ్యాయాలపై క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో రాయకుదురు, తోకలపూడి, వీరవల్లిపాలెం, తిల్లపూడి సంఘస్తులు విశ్వాసులు పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి రాజు, వెన్నా ఇస్సాకు, గుబ్బల శ్రీను,విజయ్ కుమార్, బ్రహ్మాజీ,ప్రసాద్ బాబు, ప్రేమ కుమారి, సుబ్బలక్ష్మి, ఝెమి మా, రత్నకుమారి, ప్రమీల, నారీమణి, రత్నకుమారి, తిరుపతి షారోను రాణి, సుజీవ్, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె ఈ నెల 20వ తేదీన నిర్వహిస్తున్నందున, సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ పిలుపునిచ్చారు. సీఐటీయూ పట్టణ కమిటీ సమావేశం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆదివారం జవ్వాది శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గోపాలన్ మాట్లాడుతూ లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. సమ్మెను జయప్రదం చేయాలని నినాదాలు చేశారు. ఉగ్రవాదులను అప్పగించే బాధ్యత పాకిస్తాన్‌కు ఉందని, ప్రపంచ వ్యాప్తంగా మన దేశం కూడా పాకిస్తాన్‌పై ఒత్తిడి తీసుకురావాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు, ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు, నాయకులు జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, సత్తి కోదండ రామిరెడ్డి, చల్లా చంద్రరావు, రాము, సతీష్ కుమార్, కృష్ణ, రమణ పాల్గొన్నారు.

ఘనంగా మాతృ దినోత్సవం



మాతృ దినోత్సవం నిర్వహిస్తున్న ఆరా ఫౌండేషన్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సత్యవతినగర్ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక కేంద్రంలో ఆదివారం మాతృ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆరా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, యోగా గురువు కరిబండి రామకృష్ణ ఆధ్వర్యంలో తల్లులు అందరికి వారి పిల్లలచే పుష్పాలతో పాద పూజ చేయించారు. తల్లి పట్ల వారికి ఉన్న ప్రేమను వ్యక్తం చేశారు. వక్తలు మాట్లాడుతూ తల్లి విలువను తెలుసుకోవాలన్నారు. పండ్లు, స్వీట్లు పంచారు. అపర్ణ ప్రసాదు, సూరిబాబు, కృష్ణంరాజు, లక్ష్మీనారాయణ, త్రిమూర్తులు, యోగా బృంద సభ్యులు పాల్గొన్నారు.

మిలట్రీ మాధవరం మాతృమూర్తులకు సత్కారాలు



మాతృమూర్తులను సన్మానిస్తున్న ఎస్సై శ్రీనివాస్

మదర్స్‌డే సందర్భంగా మిలట్రీ మాధవరం మాతృమూర్తులకు పట్టణంలోని శేషమహల్ సెంటర్‌లో ఆదివారం పట్టణ ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో సత్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయరాదన్నారు. నారాయణ రాజా,తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి సమర్పణ

భీమవరం(ప్రకాశంచౌక్): స్థానిక మెంటేవారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాలా త్రిపుర సుందరి అమ్మవారి వెండి పీటానికి దాతలు 160 గ్రాముల వెండిని విరాళంగా సమర్పించారు. భీమవరానికి చెందిన నార్ని రాజా బులిస్వామి, వనజ దంపతులు 110 గ్రాముల వెండి, నార్ని రామకృష్ణ దంపతులు, నార్ని శ్రీనివాస్ దంపతులు 50 గ్రాముల వెండిని కలిపి మొత్తం 160 గ్రాముల వెండిని విరాళంగా ఆలయ ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. ఆలయ అర్చకులు పూజలు చేసి దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలు.. చిన్నారులకు వరాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతుంది. రిసోర్స్ పర్సన్స్‌గా హాజరైన ప్రత్తి వీరాస్వామి, ఎ.జనార్ధనరావు, కోపల్లె శ్రీనివాస్, వి.రామాంజనేయులు, సీహెచ్ శ్రీదేవిలచే కథలు, పుస్తక సమీక్ష, ఆట, పాటలు, లెక్కలు, నీతి కథలు, పద్యాలు, ఇతర అంశాలు నేర్పించారు. మదర్స్ డే వేడుకలు నిర్వహించి, పిల్లలకు మిఠాయిలు అందజేశారు. గ్రంథాలయ అధికారి వానపల్లి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ మరింత మంది విద్యార్థులు హాజరై శిక్షణను ఉపయోగించుకోవాలని, విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.



తణుకు అర్బన్: సైన్స్ ప్రయోగాలతో సైకాలజిస్ట్ గోపాలరెడ్డి, చిన్నారులు

సమ్మర్ క్యాంప్‌లో సైన్స్ ప్రయోగాలు

తణుకు అర్బన్: వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా తణుకు సజ్జాపురం శ్రీరామకృష్ణ సేవా సమితి భవనంలో ఆదివారం నిర్వహించిన సైన్స్ ప్రయోగాలు అలరించాయి. చిన్నారులకు గత పది రోజులుగా నిర్వహిస్తున్న ఈ శిబిరంలో ప్రముఖ సైంటిఫిక్ మెజీషియన్, సైకాలజిస్ట్ మోటివేషనల్ ట్రైనర్ బాపతు మదన గోపాల రెడ్డి (గోపి మామ) నీటితో మంటలు, కంటి చూపుతో మంటలు, కొబ్బరికాయపై మంటలు, శక్తి మార్పిడి, ఘర్షణ అభికేంద్ర బలం, ఆపరేషన్ సిందూర్ మొదలైన అంశాలను ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో శ్రీరామకృష్ణ సేవా సమితి కో–ఆర్డినేటర్స్ గిరీశ్వర రావు, అక్కింశెట్టి రాంబాబు, ఎస్.రామకృష్ణ, మహేష్, లోహిత, తేజోమయి, సాయినాథ్‌రెడ్డి, ఇందిర, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



అత్తిలి: బొమ్మల తయారీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న రిసోర్స్ పర్సన్లు

విద్యార్థులకు బొమ్మల తయారీపై శిక్షణ

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులచే పంచతంత్ర కథలు, తెనాలి రామకృష్ణ కథలు చెప్పించారు. కాగితాలతో బొమ్మల తయారీపై శిక్షణ ఇచ్చారు. కాగితాలతో పలు రకాల వస్తువులు చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, గంధం శేషవేంద్ర రావు, వి లక్ష్మణరావు, బి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రతిష్ఠ పూజలు

కాళ్ల: మండలంలోని జక్కరం గ్రామంలో వేంచేసియున్న శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ పునః నిర్మాణ విగ్రహాల ప్రతిష్ఠ పూజలు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు శివ పంచాయతన క్షేత్ర అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. 12 తేదీ సోమవారం నాడు గోపూజ, గణపతి పూజ, దీక్షాధారణ, కంకణధారణ,వేద స్వస్తి, మృత్సంగ్రహణం, ఆలయశాలా ప్రదక్షిణ, తదితర ప్రత్యేక పూజలుతో ప్రారంభిస్తామన్నారు. 14వతేది బుధవారం ఉదయం 9.20 గంటలకు త్రయాహ్నిక దీక్షతో శైవాగమశాస్త్ర ప్రకారం పునః నిర్మాణ ఆలయంలో శ్రీరాజ రాజేశ్వరి సమేత రామ లింగేశ్వర స్వామి, శ్రీవిఘ్నేశ్వర స్వామి, శ్రీసూర్య నారాయణమూర్తి, శ్రీ విష్ణుమూర్తి సహిత శివ పంచాయతన క్షేత్రంలో ధ్వజ స్తంభం, పరివార దేవతా విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

వేసవిలో చిన్నారులపై శ్రద్ధ తీసుకోవాలి



చిన్నారికి వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ వంశీ శివరామరాజు

భీమవరం: వేసవిలో పిల్లలు ఎక్కువగా ఎండలో ఉండడం వలన నీరసంగా ఉంటారని, పిల్లల ఆరోగ్యానికి కొన్ని జాగ్రత్తలు పాటించాలని మదర్ నెస్ ఫౌండర్ అండ్ డైరెక్టర్, శిశువు, చిన్న పిల్లల వ్యాధుల సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ వి.వంశీ శివరామరాజు అన్నారు. భీమవరం జేపీ రోడ్డులోని మదర్ నెస్ ఫెర్టిలిటి ఉమెన్ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్‌లో ఆదివారం చిన్నారుల కోసం లిటిల్ వెల్ నెస్ క్యాంప్‌ను నిర్వహించారు. వంశీ మాట్లాడుతూ వేసవి వేడి పిల్లలపై ఎక్కువ ప్రభావం చూపుతుందని, అలాంటి వేళ తల్లిదండ్రులు కొన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. వేసవిలో పిల్లలకు డీ హైడ్రేషన్, హీట్ స్ట్రోక్, చర్మ వ్యాధులు వస్తాయని, వైద్యులు సూచించిన జాగ్రత్తలు పాటించడం, పాలు, పండ్ల రసాలు, ద్రవ పదార్థాలు ఇవ్వడం అవసరమన్నారు. అనంతరం చిన్నారులకు ప్రాథమిక ఆరోగ్య చెకప్, పోషణ, ఎత్తు, బరువు, సంపూర్ణ ఆరోగ్య తదితర పరీక్షలను నిర్వహించారు. ఫ్యాన్సీ డ్రెస్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వంశీ చైతన్య వర్మ, డాక్టర్ కలిదిండి మానస శ్రావ్య, డాక్టర్ ఎ.గోకుల్‌నాథ్, డాక్టర్ పి.సందీప్, చిన్నారులు వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలతో జనం తంటాలు

- భానుడి భగ భగలతో జనం ఉక్కిరిబిక్కిరి
- ఎండ తీవ్రతకు అల్లాడుతున్న ప్రజలు
- నిర్మానుష్యంగా మారిన రహదారులు



నిర్మానుష్యంగా ఉన్న రహదారి

వీరవాసరం: భానుడి భగభగలతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఉష్ణోగ్రతలు ఉగ్రరూపం దాలుస్తుండడంతో అసాధారణ ఎండలు ప్రజలను భయపెడుతున్నాయి. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బయటకు రావాలంటే ఆలోచించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతి రోజూ సుమారు 35 నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉద్యోగ, ఉపాధి రీత్యా బయటకు రావాల్సిన పరిస్థితి ఉండడంతో ఎండల బారిన పడకుండా ప్రయాణాలు చేయాలంటేనే ఏం చేయాలో పాలు పోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు సమ్మర్ క్లాసులకు, నిరుద్యోగులు పోటీ పరీక్షల కోచింగ్ సెంటర్లకు ప్రతి రోజూ రహదారులపై వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ద్విచక్ర వాహనాలతో, సైకిళ్లతో ప్రయాణాలు చేస్తుంటారు. ఎండ సమయంలో ముఖ్యంగా మండల కేంద్రమైన వీరవాసరంలో శృంగవృక్షం రెల్వే స్టేషన్ వద్ద రైల్వే గేటు వేస్తే సిగ్నల్ దగ్గర ఇరువైపులా బారులు తీరిన వాహనాలు, ప్రయాణికులు మండుతున్న ఎండలోనే నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. రైల్వే సిగ్నల్ వేసిన సమయంలో ప్రయాణికులు నానా అవస్థలు పడుతూ మండుటెండలో ఉండాల్సిన పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు ఎండలు మరింత ముదురు పాకానపడ్డాయని ప్రజలంతా వాపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణాలు చేయాలంటేనే భయాందోళన గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపశమన చర్యలు చేపట్టాలి

ప్రజలు ఎండ బారిన పడకుండా ప్రభుత్వం ఉపశమన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతు న్నారు. అదే విధంగా వీరవాసరం, శృంగవృక్షం రైల్వే గేట్ సమీపంలోనూ, ప్రయాణికులు రద్దీగా ఉండే ప్రాంతాల్లోనూ షేడ్ నెట్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎండ నుంచి రక్షణ కల్పించడానికి అధికారులు, నాయకులు ఆ దిశగా ఆలోచించాలని కోరుతున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న మే, జూన్ నెలల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు, ప్రజా సమస్యలపై ప్రభుత్వ యంత్రాంగం దృష్టి సారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రధాన కూడళ్లలో, గ్రామాల్లో మంచి నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్‌తో కూడిన చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రైల్వే గేట్ల వద్ద షేడ్ నెట్లు ఏర్పాటు చేయాలి



నేను లేసు వ్యాపారం చేస్తుంటాను. ప్రతి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు బండిపై ప్రయాణం చేయాలి. మే నెల ఎండ దాటికి తట్టుకోలేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. ప్రధాన రహదారి కూడళ్లలోనూ, రైల్వే సిగ్నల్స్ వద్ద నీడనిచ్చే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తే బాగుంటుంది. ప్రయాణికులు సేదతీరే అవకాశం ఉంటుంది.

– కటకం సుబ్రహ్మణ్యం, లేస్ వ్యాపారి, రాయకుదురు

చలివేంద్రాల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు

ప్రధాన రహదారులు, గ్రామాల్లోనూ ఆరోగ్య సిబ్బందితో కలిసి చలివేంద్రాల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. రైల్వే సిగ్నల్ దగ్గర ప్రధాన కూడళ్లలో షేడ్ నెట్ల ఏర్పాటుకు వీలును బట్టి పరిశీలిస్తాం. ప్రత్యేక అవసరం ఉంటేనే తప్ప బయటకు రాకుండా ఉంటేనే మంచిది. తప్పని సరి పరిస్థితుల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే ప్రయాణాలు చేయాలి.

– బి.అప్పారావు, ఎంపీడీవో, వీరవాసరం

పోలీసుల తనిఖీలు

భీమవరం: నిఘా విభాగాల సమన్వయంతో జిల్లాలోని బస్ స్టేషన్, రైల్వే స్టేషన్, కీలక ప్రదేశాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని పోలీసు అధికారులు తెలిపారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాల మేరకు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, పోలీసులు ఈ తనిఖీలను చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, లగేజీపై ప్రత్యేక దృష్టి సారించి, క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు.